andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 । కనిష్ఠం 20.8

కామారెడ్డి
జిల్లా వార్తలు

5

శనివారం 14 సెప్టెంబరు 2024

ఇసుక అక్రమ డంపుల వేలం

బిచ్కుంద, సెప్టెంబరు 13: మండలంలోని గోపన్‌పల్లి గ్రామశివారు గుట్టలలో అక్రమంగా డంపు చేసిన 18 ట్రాక్టర్ల ఇసుకను శుక్రవారం వేలంపాట నిర్వహించినట్లు ఆర్ఐ రవీందర్ తెలిపారు. అక్రమంగా డంపు చేసిన ఇసుకను సీజ్ చేయడంతో పాటు వేలంపాట నిర్వహించగా 30,600 రెవెన్యూ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మండలంలోని హస్గుల్, శెట్లూర్, ఖత్‌గావ్, పుల్కల్ మంజీరా పరివాహక ప్రాంతాల్లో ఎక్కడైన ఇసుక అక్రమ డంపులకు పాల్పడితే సమాచారం అందివ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని వివరించారు.



భారీ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట



పంట చేన్లలో నీరు చేరిన దృశ్యం



నీట మునిగిన వరి పంట

రైతన్నకేది ధీమా!

కామారెడ్డి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దేశానికి అన్నం పెట్టే రైతన్నకు భరోసా లేకుండా పోతోంది. పంటల సాగు సమయంలో ప్రకృతి వైపరీత్యాలకు రైతన్న తీవ్రంగా నష్టపోతుండగా, ఆరుగాలం పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలవుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలను, రైతులను ఆదుకునేందుకు ఫసల్ బీమా పథకం, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేందుకు పలు పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్నప్పటికీ అన్నదాతలకు మాత్రం ఎలాంటి ప్రయోజనాలు చేకూరడం లేదు. ఈ పథకాలకు ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. దీంతో భారీ వర్షాలు, అకాల వర్షాలు, వడగండ్ల వాన, ఈదురు గాలులు, చీడపీడల వల్ల పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోతూ అప్పుల పాలవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు, చీడపీడల వల్ల వేల ఎకరాల్లో వివిధ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలంటూ బాధిత రైతులు దీనంగా ప్రభుత్వం వైపు చూస్తున్నారు.

పంటలకు బీమా కల్పించడమే ఫసల్ బీమా పథకం

ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు భారీ వర్షాలు, అకాల వర్షం, ఈదురు గాలులు, వడగండ్లు, కరువు కాటకాలకు గురై దెబ్బతినడంతో రైతులు కోలుకోలేకపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలకు రక్షణ కల్పించేందుకు పీఎంఎఫ్‌బీవై పథకానికి కేంద్ర ప్రభుత్వం స్వీకారం చుట్టింది. సాధారణంగా బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందిన రైతులకు పంట బీమా ప్రీమియం ఖాతాల నుంచి మినహాయించుకుంటారు. ఈ బీమా పథకంలో పంట నష్టం చెల్లింపునకు సామూహికంగా పరిగణనలోకి తీసుకుంటూ వస్తున్నారు. దీంతో అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షం, వడగండ్లు, కరువుతో పంట నష్టపోయిన పరిహారం అందక రైతులు అప్పుల ఊబిలో కూరకపోతున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం బీమా నిబంధనలు సడలించి గతంలో ఫసల్ బీమా యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతులతో పాటు పొందని రైతులకు అవకాశం కల్పించేవారు. పంట రుణాలు పొందిన రైతులకు బీమా తప్పని సరి. రుణాలు పొందిన వారు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాల్సి ఉంటుంది. ఎకరం చొప్పున ప్రీమియం చెల్లించడం ద్వారా పైరు నాటు వేసినప్పటి నుంచి కొత కోసే వరకు పంట నష్టానికి బీమా కంపెనీలు బాధ్యత వహిస్తుంటాయి.

ఇటీవల భారీ వర్షాలకు 560 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 560 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో నిర్వహించిన సర్వేలో తేలింది. 390 మంది రైతులు నష్టపోయినట్లు ఆ శాఖ అధికారులు గుర్తించారు. కామారెడ్డి, భిక్కనూర్, తాడ్వాయి, రామారెడ్డి, గాంధారి, సదాశివనగర్, రాజంపేట, బీబీపేట, దోమకొండ మండలాల్లో పంటలు వరదల తాకిడికి కొట్టుకుపోగా మరికొన్ని చోట్ల వర్షపు నీటిలో మునిగిపోయాయి. వరి పంటకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. 450 ఎకరాల్లో వరి వరదల తాకిడికి నష్టం ఏర్పడింది. పత్తి 15 ఎకరాలు, మొక్కజొన్న 10, సోయాబిన్ 10, కూరగాయల పంటలు 15 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖాధికారులు తెలిపారు. భిక్కనూర్ మండలంలో 221 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లగా 115 మంది రైతులు నష్టపోయారు. తాడ్వాయిలో 110 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లగా 85 మంది రైతులు, కామారెడ్డిలో 65 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా 61 మంది రైతులు నష్టపోయారు. ఇదిలా ఉండగా చీడపీడల వల్ల సుమారు 300ల ఎకరాలకు పైగా పత్తిపంట ఎండిపోవడంతో వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు.

- » భరోసా ఇవ్వని ఫసల్ బీమా పథకం
- » ఐదేళ్లుగా అమలులో లేని పంటల బీమా
- » ప్రతీఏటా ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతింటున్న పంటలు
- » భారీ వర్షాలు, చీడపీడలతో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం
- » తీవ్రంగా నష్టపోతున్న రైతన్నలు
- » పంటల సాగులో అప్పుల పాలవుతున్న వైనం
- » ఇటీవల అకాల వర్షాలకు వేల ఎకరాల్లో పంటలకు నష్టం
- » నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలంటున్న బాధిత రైతులు

ఐదేళ్లుగా అమలులో లేని బీమా పథకం

రైతుల పంటలకు భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఫసల్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో దెబ్బతిన్న పంటలకు ఈ పథకం ద్వారా రైతులకు నష్టపరిహారాన్ని చెల్లించేవారు. ఈ పథకంలో లోపాలున్నాయనే కారణంతో గత రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం నిలిపివేసింది. ప్రత్యామ్నాయంగా మరో పథకం ఏమీ తీసుకురాలేదు. ప్రకృతి వైపరీత్యాలతో నాలుగేళ్లుగా నష్టపోతున్న రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. రైతులు ఏ కారణంతో చనిపోయినా రైతుబీమా అమలు చేస్తున్న ప్రభుత్వం పంట నష్టపోతే ఆర్థిక భరోసా మాత్రం ఇవ్వడం లేదు. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో ఆ ప్రభుత్వం పంటల బీమాపై కసరత్తు చేస్తోంది. కేంద్రం అమలు చేస్తున్న ఫసల్ బీమాను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 2020-21లో 1874 మంది రైతులకు సంబంధించి 3426 ఎకరాలు, 2021-22లో 1035 మంది రైతులకు సంబంధించి 2817 ఎకరాలు, 2022-23లో 4143 మంది రైతులకు సంబంధించి 7798 ఎకరాల్లో, 2023-24లో 60 వేల 239 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

సర్వేలతోనే సరి పెడుతున్నారు

భారీ వర్షాలు, అకాల వర్షాలు, వడగండ్ల వానలు, అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతింటున్న రైతులకు మాత్రం నష్టపరిహారం అందడం లేదు. వడగండ్ల వానలు, భారీ వర్షాలు కురిసి పంట చేన్లలోనే రైతుల పంటలు దెబ్బతినడమే కాకుండా నీటమునిగి కొట్టుకుపోయిన, మొలకలు వచ్చిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి సమయంలో సంబంధిత వ్యవసాయశాఖ క్షేత్రస్థాయిలో సర్వేలు చేసి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. పంట నష్టం సర్వేలతోనే అధికారులు సరిపెడుతున్నారు. ఈ నష్టం అంచనా కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి. ఐదేళ్లుగా పంట నష్టపరిహారం ప్రభుత్వాలు అందించకపోవడంతో రైతులకు అప్పులే మిగులుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటుంది. నష్టపోయిన పంటలకు ఎకరాన రూ.10వేల చొప్పున ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో నష్టపోయిన రైతులకు పరిహారం అందుతుందో లేదో చూడాలి.

టీ-ప్రైడ్ పథకం కింద పెట్టుబడి రాయితీ మంజూరు

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 13: టీ-ప్రైడ్ పథకం కింద పెట్టుబడి రాయితీ మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐ పాస్ కింద నలుగురు ఎస్సీ లబ్ధిదారులకు రూ.13లక్షల 89 వేల 491లు, ఎనిమిది మంది ఎస్టీ లబ్ధిదారులకు రూ.23లక్షల 80 వేల 529లు పెట్టుబడి రాయితీ మంజూరుకు కమిటీ ఆమోదిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ లాలునాయక్, ఎల్‌డీఎం రవికాంత్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిని రజిత, మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా భూగర్భ శాఖాధికారి సతీష్, ఆర్‌టీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పచ్చదనం నెలకొనాలి


శ్రమదానంతో పరిసరాలు పచ్చదనంతో వెల్లివిరియాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది శ్రమదానం చేసి పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్‌లను ఏరివేయడం జరిగింది. భవన సముదాయం ప్రాంగణంలోని పలు ప్రాంతాలను వివిధ శాఖలకు గతంలో వాటి పరిరక్షణకు చేయడానికి కేటాయించారు. భవన సముదాయం కలియ తిరుగుతూ గార్డెన్ నిర్వాహకులకు పలు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యాలయాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వివిధ శాఖల సిబ్బంది వారికి కేటాయించిన ప్రాంతాలలోని పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినాయకునికి పూజ చేసిన కలెక్టర్

కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లా సమీకృత భవన సముదాయంలో ప్రతిష్ఠించిన వినాయకునికి శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి రాజారాం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎన్.భీమ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం అన్నప్రసాదాలు స్వీకరించారు.

పంచాయతీల.. డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల

- జిల్లా వ్యాప్తంగా 6,36,300ల మంది ఓటర్లు
- పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ
- పురుషులవి 3,06,536 ఓట్లు
- మహిళలవి 3,29,740 ఓట్లు
- గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాను ప్రదర్శించిన అధికారులు
- నేటి నుంచి అభ్యంతరాల స్వీకరణ



కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 13: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని 535 గ్రామ పంచాయతీలకు సంబంధించి వార్డుల వారీగా రూపొందించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాను జిల్లా పంచాయతీశాఖ శుక్రవారం విడుదల చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల ఓటరు జాబితా ఆధారంగా గ్రామ పంచాయతీల ఓటరు జాబితాను అధికారులు తయారు చేశారు. ఈ ఓటరు జాబితా వివరాలను ఆయా పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై ప్రచురించారు. నేటి నుంచి ఓటరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఈ నెల 18న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ముసాయిదా ఓటరు జాబితాను వివరించనున్నారు. 19న ఆయా మండల కేంద్రాల్లో ఎంపీడీవోలు రాజకీయ నాయకులతో సమావేశం అవుతారు. 26 వరకు అభ్యంతరాలను పంచాయతీ అధికారులు పరిష్కరిస్తారు. 28న తుది ఓటరు జాబితాను ప్రకటించనున్నారు.

జిల్లాలో 6,36,300ల మంది ఓటర్లు

త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నందున డ్రాఫ్ట్ ఓటరు జాబితాను పంచాయతీ శాఖ విడుదల చేసింది. జిల్లాలోని 535 గ్రామ పంచాయతీల పరిధిలో 6,36,300ల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులవి 3,06,538 ఓట్లు ఉండగా, మహిళలవి 3,29,747 ఓట్లు, 15 మంది ఇతరుల ఓట్లు ఉన్నాయి. బాన్సువాడ మండలంలో మొత్తం ఓట్లు 28,926 ఉండగా పురుషులవి 13,891, మహిళలవి 15,033, ఇతరులవి 2 ఓట్లు ఉన్నాయి. భిక్కనూరు మండలంలో మొత్తం ఓట్లు 38,239 ఉండగా పురుషులవి 18,311, మహిళలవి 19,926, ఇతరులవి 2 ఓట్లు ఉన్నాయి. బీబీపేట మండలంలో మొత్తం ఓట్లు 20,619 ఉండగా పురుషులవి 9,940, మహిళలవి 10,679, ఓట్లు ఉన్నాయి. బిచ్కుంద మండలంలో మొత్తం ఓట్లు 40,158 ఉండగా పురుషులవి 19,661, మహిళలవి 20,492, ఇతరులవి 5 ఓట్లు ఉన్నాయి. బీర్కూర్ మండలంలో మొత్తం ఓట్లు 19,831 ఉండగా పురుషులవి 9,358, మహిళలవి 10,473 ఓట్లు ఉన్నాయి. దోమకొండ మండలంలో మొత్తం ఓట్లు 23,928 ఉండగా పురుషులవి 11,278, మహిళలవి 12,650 ఓట్లు ఉన్నాయి. గాంధారి మండలంలో మొత్తం ఓట్లు 39,418 ఉండగా పురుషులవి 19,489, మహిళలవి 19,929 ఓట్లు ఉన్నాయి. జుక్కల్ మండలంలో మొత్తం ఓట్లు 35,995 ఉండగా పురుషులవి 17,945, మహిళలవి 18,050 ఓట్లు ఉన్నాయి. కామారెడ్డి మండలంలో మొత్తం ఓట్లు 18,288 ఉండగా పురుషులవి 8,651, మహిళలవి 9,637 ఓట్లు ఉన్నాయి. లింగంపేట మండలంలో మొత్తం ఓట్లు 37,203 ఉండగా పురుషులవి 17,939, మహిళలవి 19,263, ఇతరులవి 1 ఓట్లు ఉన్నాయి. మాచారెడ్డి మండలంలో మొత్తం ఓట్లు 35,088 ఉండగా పురుషులవి 16,655, మహిళలవి 18,432 ఇతరులవి 1 ఓట్లు ఉన్నాయి. మద్నూర్ మండలంలో మొత్తం ఓట్లు 45,969 ఉండగా పురుషులవి 22,917, మహిళలవి 23,052 ఓట్లు ఉన్నాయి. నాగిరెడ్డిపేట మండలంలో మొత్తం ఓట్లు 25,169 ఉండగా పురుషులవి 17,770, మహిళలవి 13,426 ఓట్లు ఉన్నాయి. నస్రూల్లాబాద్ మండలంలో మొత్తం ఓట్లు 20,827 ఉండగా పురుషులవి 9,752, మహిళలవి 11,075 ఓట్లు ఉన్నాయి. నిజాంసాగర్ మండలంలో మొత్తం ఓట్లు 27,872 ఉండగా పురుషులవి 13,160, మహిళలవి 14,711 ఇతరులవి 1 ఓట్లు ఉన్నాయి. పెద్దకొడప్‌గల్ మండలంలో మొత్తం ఓట్లు 16,163 ఉండగా పురుషులవి 8,048, మహిళలవి 8,114, ఇతరులవి 1 ఓట్లు ఉన్నాయి. పిట్లం మండలంలో మొత్తం ఓట్లు 34,686 ఉండగా పురుషులవి 16,835, మహిళలవి 17,849, ఇతరులవి 2 ఓట్లు ఉన్నాయి. రాజంపేట మండలంలో మొత్తం ఓట్లు 22,006 ఉండగా పురుషులవి 10,569, మహిళలవి 11,437 ఓట్లు ఉన్నాయి. రామారెడ్డి మండలంలో మొత్తం ఓట్లు 27,595 ఉండగా పురుషులవి 13,091 మహిళలవి 14,505 ఓట్లు ఉన్నాయి. సదాశివనగర్ మండలంలో మొత్తం ఓట్లు 32,425 ఉండగా పురుషులవి 15,557, మహిళలవి 16,848 ఓట్లు ఉన్నాయి. తాడ్వాయి మండలంలో మొత్తం ఓట్లు 25,573 ఉండగా పురుషులవి 12,087, మహిళలవి 13,486 ఓట్లు ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలంలో మొత్తం ఓట్లు 20,295 ఉండగా పురుషులవి 9,615, మహిళలవి 10,680 ఓట్లు ఉన్నాయి.

శివలింగాన్ని అవమానపరుస్తూ షార్ట్ ఫిలిం రూపొందించడం సిగ్గుచేటు

గుడిమెట్ పీఠాధిపతి మహాదేవ్ స్వామీజీ



మాట్లాడుతున్న గుడిమెట్ పీఠాధిపతి మహాదేవ్ స్వామీజీ

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 13: శివలింగాన్ని అవమానపరుస్తూ షార్ట్ ఫిలింను రూపొందించడం సిగ్గుచేటని గుడిమెట్ పీఠాధిపతి మహాదేవ్ స్వామీజీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మ, విష్ణు మధ్యలో ఉద్భవించిన లింగమే శివుని స్వరూపంగా పూజించబడుతుందన్నారు. అలాంటి శివలింగాన్ని లింగమర్మం అనే షార్ట్ ఫిలింలో అవమానిస్తూ చిత్రాలు తీయడం సిగ్గుచేటని అన్నారు. ఈ షార్ట్ ఫిలింలో శివభక్తుల, హిందువుల మనోభావాలను దెబ్బతీశారని అన్నారు. ఎవరి మతం వారు ప్రచారం చేసుకోవడం తప్పుకాదని వారి మతాన్ని గొప్పగా చూపుకునేందుకు ఇతరులను కించపరిచేలా మాట్లాడడం, షార్ట్ ఫిలిమ్స్ తీయడం సరికాదన్నారు. యూట్యూబ్‌లో ఉన్న షార్ట్ ఫిలిమ్‌ను వెంటనే తొలగించాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఇటీవల హిందూ దేవుళ్లను అవమానించడం పరిపాటిగా మారిందని యావత్ హిందూ బంధువులంతా ఏకమై ఇలాంటి వారికి బుద్ధి చెప్పాలని అన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన పిరమిడ్ ధ్యాన మందిరం ప్రకటించిన 18 సూత్రాలను తక్షణమే తొలగించాలని అన్నారు. ధ్యానం చేయడం తప్పుకాదని, హిందూ మనోభావాలు దెబ్బతీసేలా సూత్రాలను చేర్చడం తప్పని అన్నారు. ఈ కార్యక్రమంలో రామేశ్వర్, ఆదిత్య, వినోద్, మల్లికార్జున్, కార్తిక్, ఓంకార్ పాల్గొన్నారు.

ఓబీసీసీ యూట్యూబ్ నిర్వాహకుడిపై ఫిర్యాదు

గాంధారి: గాంధారి మండలం గుడిమెట్ గ్రామానికి చెందిన మహదేవ్ స్వామిజీ యూట్యూబర్‌లపై ఫిర్యాదు చేశాడు. హిందూ ధర్మాన్ని కించపరుస్తూ షార్ట్ ఫిలింలను తీస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. లింగమర్మం అనే షార్ట్‌ఫిలింలో శివునిపై చాలా అసభ్యకరంగా వ్యాఖ్యలు చేస్తూ చిత్రీకరణ చేపట్టారని వెంటనే ఆ ఫిలింను తొలగించడంతో పాటు అందుకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయాలని కోరారు.

భీమ్‌గల్‌లో చెరువులను పరిశీలించిన కమిషనర్

భీమ్‌గల్, సెప్టెంబరు13: గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువును మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. నిమజ్జనం చేసే ప్రదేశంలో అనువుగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గణేష్ నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో నిమజ్జనోత్సవం జరుపుకోవాలని చెప్పారు. ఆయనవెంట మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కాకతీయ కాలువలో పడి రేషన్ డీలర్ గల్లంతు

మెండోర, సెప్టెంబరు 13: మండలకేంద్రానికి చెందిన రేషన్‌డీలర్ గాండ్ల అశోక్ (33) ప్రమాదవశాత్తు గురువారం రాత్రి కాలువలో పడి గల్లంతైనట్లు ఎస్సై నారాయణ తెలిపారు. అశోక్ మిత్రుడితో కలిసి పోచంపాడ్ నుంచి మెండోర వచ్చేటప్పుడు కాకతీయ కాలువలో పడి గల్లంతైనట్లు వివరించారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రివరకు కాలువలో గాలించినా అశోక్ ఆచూకీ లభించకపోవడంతో బంధుమిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. అశోక్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. అశోక్ భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

భీమ్‌గల్‌లో మహిళ ఆత్మహత్య

భీమ్‌గల్, సెప్టెంబరు 13: మతిస్థిమితం లేక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణకేంద్రంలోని అయ్యప్పనగర్‌కు కాలనీకి చెందిన పోతుగంటి రాజమణి గత కొన్నిరోజులుగా మతిస్థిమితం లేక ప్రవర్తిస్తోంది. ఇందులో భాగంగానే గురువారం ఉదయం తనఇంట్లోని బాత్‌రూంలోని యాసిడ్‌తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు నిజామాబాద్ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలి భర్త శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు సుద్దపల్లి విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, సెప్టెంబరు13: సుద్దపల్లి గురుకుల పాఠశాలకు చెందిన సాత్విక, గంగోత్రి, నేహశ్రీ, ప్రీతి, గంగజమున, కావ్యకిసోరి, శరణ్య, మహేశ్వరి, బిందు, ఎస్తార్ రాణి రాష్ట్రస్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నళిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14నుంచి 16వరకు నిర్మల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ పద్మ, వనిత అనూస, పీఈటీ శ్రీలత, కోచ్ మౌనికలు అభినందించారు.

తగిలేపల్లిలో లక్ష్మి గణపతి హోమం

వర్ని,సెప్టెంబర్ 13: మండలంలోని తగిలేపల్లి గ్రామంలో శుక్రవారం లక్ష్మి గణపతి హోమంను వైభవంగా నిర్వహించారు. శివాజీ గణేష్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో సాగాలి

ఏర్గట్ల, సెప్టెంబరు 13: గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో సాగాలని, అందుకు మండపాల నిర్వాహకులు సహకరించాలని భీమ్‌గల్ సీఐ నవీన్, ఎస్సై రాములు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పలు మండలి నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని వీడీసీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఏర్గట్ల పీఎస్ సిబ్బంది, గ్రామ కమిటీ సభ్యులు, పలు యుజనల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కోటగిరి మండల ప్రత్యేక అధికారిగా అలీం అహ్మద్ బాధ్యతల స్వీకరణ

కోటగిరి,సెప్టెంబరు13: కోటగిరి మండల ప్రత్యేక అధికారిగా అలీం అహ్మద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బోధన్ వ్యవసాయ శాఖ ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న అలీం అహ్మద్‌కు కోటగిరి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో చందర్‌నాయక్ పాల్గొన్నారు.

రుద్రూరు తహసీల్దార్‌గా తారాబాయి బాధ్యతల స్వీకరణ

రుద్రూరు రూరల్, సెప్టెంబరు13: రుద్రూరు నూతన తహసీల్దార్‌గా బర్మావత్ తారాబాయి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం రుద్రూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆమె పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నజీర్, జూనియర్ అసిస్టెంట్ కొర్వ భూషన్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు

ఏర్గట్ల, సెప్టెంబరు13: మండల కేంద్రంలోని కొత్తగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం గ్రామాభివృది కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్‌సౌకర్యాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్‌వో సంధ్య మాట్లాడుతూ పాఠశాలకు విద్యుత్ అసౌకర్యంపై వీడీసీ సభ్యులకు, పలు నాయకుల దృష్టికి తీసుకెళ్లామని, స్పందించిన అధికారులకు, వీడీసి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఛత్రపతి శివాజీ విగ్రహా ప్రతిష్ఠపన కోసం భూమిపూజ

ముప్కాల్, సెప్టెంబరు13: మండలకేంద్రంలోని మార్కెట్‌యార్డు వద్ద బైపాస్ రోడ్డు వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహా ప్రతిష్ఠాపనకు శుక్రవారం శివాజీ విగ్రహ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు.



అరోగ్యశిబిరంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వైద్య, ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

● పోలీసులు ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ప్రభుత్వ విప్

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 13: వైద్య, ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని రాజన్నసిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో సిరిసిల్లా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మెగా ఆరోగ్య వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, సిరిసిల్లా కలెక్టర్ సంజీవ్‌జా, జిల్లా పోలీస్ కమిషనర్ అఖిల మహాజన్, అదనపు పోలీస్ కమీషనర్ శేషాద్రిరెడ్డి, జిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు వైద్యశిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుదారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుంటూ అందరూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నాయరు. మానాల గ్రామంతోపాటు చుట్టుపక్కలగల గిరిజన గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. సుమారు 4 వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేసినట్ల వైద్య ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమలో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిదులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంతర్ పాఠశాల క్రీడల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

ముప్కాల్, సెప్టెంబరు 13: గత మూడు రోజులుగా బాల్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన బాల్కొండ ఉమ్మడి మండలాల అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో ముప్కాల్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ముప్కాల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులను ఎంఈవో బట్టు రాజేశ్వర్, స్పెషల్ ఆఫీసర్ వినోద, పీఈటీని అభినందించారు. మార్చ్ ఫస్ట్‌లో మొదటిబహుమతి సాధించిన, 100 మీటర్ల పరుగుపందెంలో రెండో బహుమతి, సాంస్కృతిక కార్యక్రమాల్లో బహుమతుల గెలుపొందినట్లు తెలిపారు.

పాఠశాలల అభివృద్ధికి నిధుల మంజూరు

కోటగిరి, సెప్టెంబరు13: మండలకేంద్రంలో వివిధ అభివృద్ధి పనులకు వ్యవసాయశాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి నిధులు మంజూరు చేశారని జిల్లా కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాత బస్టాండ్ నిర్మాణానికి రూ. 15లక్షలు, జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు గదులకు రూ.12 లక్షలు, మిర్జాపూర్ ప్రాథమిక పాఠశాల అదనపు గదులకు రూ.12 లక్షలు, కోటగల్లీ ప్రాథమిక పాఠశాల అదనపు గదులకు రూ.24 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు షాహీద్, అనంత్, మిర్జాపూర్ సాయన్న, అయుబ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఏర్గట్ల, సెప్టెంబరు13: మండలకేంద్రంతో పాటు తాళ్లరాంపూర్ గ్రామంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరీ అయిన చెక్కులను ముగ్గురి లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు, లబ్ధిదారులు చెక్కుల మంజూరీకి కృషిచేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెపు గంగాప్రసాద్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కొట్టాల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మహిళలకు అండగా షీటీం

ముప్కాల్, సెప్టెంబరు13: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే షీటీంకు సమాచారం ఇవ్వాలని సబ్‌డివిజన్ షీటీం కానిస్టేబుల్ సుమతి విద్యార్థినిలకు తెలిపారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలోని మైనారిటీ హైస్కూల్, కళాశాలలో సైబర్ క్రైం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్‌తో ఇబ్బందులు పడుతున్న విద్యార్థినిలు, మహిళా ఉద్యోగులు భయపడకుండా 100నెంబర్‌కు, 8712659795 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చందన, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్రైడే, డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు13: ప్రతీ శుక్రవారం ఫ్రైడే, డ్రైడే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రాజాశ్రీనివాస్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ దోమల వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై గ్రామస్థులు అవగాహన కల్పించారు. నిలువఉన్న నీటిలో లార్వాగ తయారై దోమలుగ మారుతాయని వీటివల్ల మలేరియ, డెంగ్యూ, లాంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తించి మరణానికి దారితీస్తాయని వీటిపట్ల ప్రజలు తగుజాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఏఎన్ఎం మమత స్థానిక అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు ఉన్నారు. అంతకుముందు స్థానికఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌ఏర్పాటు కోసం తరగతి గదులను పరిశీలించారు.

చిట్టాపూర్‌లో విద్యార్థి అదృశ్యం

ముప్కాల్, సెప్టెంబరు13: బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన కంచె రాకేష్ అనే విద్యార్థి అదృశ్యమైనట్టు బాల్కొండ ఎస్సై బి.నరేష్ తెలిపారు. చిట్టాపూర్ గ్రామంలో ఈనెల 11 రాత్రి 7గంటల సమయంలో గణపతిని చూసేందుకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదని తల్లి కంచె బాను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుచేయగా కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.నరేష్ తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే 8712659756కు చేయాలని ఎస్సై తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణాదానం

డిచ్‌పల్లి, సెప్టెంబరు13: యువజన సంఘాల యువకులు అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నట్టే రక్తదానాలు చేయడానికి ముందుకురావాలని రక్తదానం మరొకరికి ప్రాణదానమని రెడ్ క్రాస్‌సొసైటీ జిల్లా చైర్మన్ బూస అంజనేయులు అన్నారు. శుక్రవారం యువసేన యూత్ ఆధ్వర్యంలో ఘన్‌పూర్ లో గణేశ్ మండపంలో 20మంది యువకులు ముందుకురావడం అభినందనీయమన్నారు. యువత సమాజసేవ కార్యక్రమాల్లో పాల్గొంటూ రక్తదానం చేయడానికి జిల్లాలోనే మొదటిసారిగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. శిబిరంలో రక్తదాతలు మ్యాన కృష్ణ తేజా, రమణ, సాయినాథ, మహేశ్, ప్రశాంత్ గౌడ్, దిలీప్, విజయ్, రవి, నరేశ్, వీడీసీ సభ్యులున్నారు.

వికసిత భారత్ అఖిల భారతీయ మహిళా సదస్సు విజయవంతం చేయాలి

డిచ్‌పల్లి, సెప్టెంబరు13: అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంగ్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రిసెర్చ్ ఆధ్వర్యంలో అఖిల భారతీయ మహిళా విశ్వవిద్యాలయ బోధకుల కాన్ఫరెన్స్ ఈనెల 21న ఓయూలో నిర్వహిస్తున్నారని ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ ప్రొ.సుధాకరరెడ్డి శుక్రవారం బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కాన్ఫరెన్స్ లో వికాసిత్ భారత్‌లో మహిళా అధ్యాపకుల పాత్ర పరిశోధన చర్చించనున్నారు. అభివృద్ధి చెందే భారతదేశానికి మహిళా నాయకత్వం సవాళ్లపై చర్చిస్తారన్నారు. పారిశ్రామిక వేత్తల, విద్యా ప్రాధాన్యతలు సదస్సులో చర్చిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరతి, స్వప్న, స్రవంతి, పద్మ, రమ్య, నీలిమా, కార్యక్రమాన్ని ప్రొఫెసర్ వాసం చంద్రశేఖర్ సమన్వయం చేశారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

నవీపేట, సెప్టెంబరు13: ఓటర్ల జాబితా పరిశీలనకు చేపట్టిన ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆగస్టు 20 నుంచి చేపట్టిన ఇంటింటి సర్వే వచ్చే అక్టోబరు వరకు కొనసాగనుంది. దీనికి సంబంధించి బీఎల్‌వోలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. కుటుంబంలో ఉన్న ఓటర్ల పేర్ల పరిశీలన, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, 18 ఏళ్లు నిండిన వారికి నూతనంగా ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు వంటి వివరాలను బీఎల్‌వోలు తమ యాప్‌లో నమోదు చేయవాల్సి ఉంటుంది.



బీఎల్‌వోలను ఉద్దేశించి మాట్లాడుతున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

ఇంటింటి సర్వేలో నవీపేట మండలం పూర్తిగా వెనుకబడి ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు. తమకు బీఎల్‌వో విధులు అదనపు భారంగా ఉందని, తమకు బీఎల్‌వో విధుల నుంచి తప్పించాలని పలువురు పంచాయతీ కార్యదర్శులు, పలువురు అంగన్‌వాడీ టీచర్‌లు సబ్ కలెక్టర్ దృష్టికి తేగా ప్రతీఒక్కరు తమ బీఎల్‌వో విధులు కచ్చితంగా నిర్వహించవాల్సిందేనని సబ్‌కలెక్టర్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీవో రామకృష్ణ, నాయబ్ తహసీల్దార్ తేలంగ్‌రావు, ఆర్ఐ నరేష్, మండల రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ దేవిసింగ్ ఉన్నారు.

గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 13: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో స్వర్ణలత అన్నారు. చిన్నారులు, గర్భిణీలకు తీసుకోవాల్సిన పోషకాహారంపై శుక్రవారం అవగాహన కల్పించారు. గర్భిణీలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో దేవ సాల, ఏఎన్ఎంలు మహలక్ష్మీ, అంగన్‌వాడీ వర్కర్లు జ్యోతి, ఆశాకార్యకర్తల కరుణ పాల్గొన్నారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లి రాంపూర్‌గ్రామాల్లో పోషణ్ అభియన్ కార్యక్రమాల్లో ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ పలు ఆరోగ్య సూచనలు ఇచ్చారు. పాల్గొన్నారు కార్యక్రమంలో బుజ్జి, మమత, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు బహుమతులు అందజేస్తున్న సీడీపీవో

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

బోధన్‌రూరల్: గర్భిణీ, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మహిళలు ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. పౌష్టికాహారంతోనే మహిళలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, అంగన్‌వాడీ టీచర్‌లు సుశీల, జయలక్ష్మి, ఆశ వర్కర్‌లు స్వరూప, శోభ పాల్గొన్నారు.



శిరీష (ఫైల్)

జ్వరంతో యువతి మృతి

రెంజల్, సెప్టెంబరు 13: మండలంలోని నీలా గ్రామానికి చెందిన క్యాతం శిరీష (24) జ్వరంతో బాధపడుతూ మృతిచెందింది. గత కొద్దిరోజులుగా విషజ్వరంతో శిరీష మంచాన పడింది. స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోటగిరి, సెప్టెంబరు 13: పొతంగల్ మంజీరనది నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా టిప్పర్‌ను పట్టుకున్నట్లు చెప్పారు.

శివాలయంలో హుండీ లెక్కింపు

బోధన్‌రూరల్, సెప్టెంబరు 13: మండలంలోని ఏకచక్రేశ్వరాలయంలో శుక్రవారం హుండీలెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీ లెక్కింపులో రూ.86,653 వచ్చినట్లు లభించినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల తెలిపారు. కార్యక్రమంలో హరికాంత్ చారి, దేవాదాయ శాఖ ఈవో రవీందర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ రాములు, అర్చకులు గణేష్ శర్మ, మహేష్ పాఠక్, భూమేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

బోధన్‌రూరల్, సెప్టెంబరు13: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని సాలూర నూతన తహసీల్దార్ శశిభూషణ్ అన్నారు. శుక్రవారం సాలూర తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ప్రతీఒక్కరు పాటించాలన్నారు. బోధన్ తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన శశిభూషణ్ సాలూర తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారిస్తామన్నారు.

మల్లారం ఆశ్రమ పీఠాధిపతి ప్రత్యేక పూజలు

మోస్రా, సెప్టెంబరు13: మండల కేంద్రంలోని బాపనయ్య నగర్ కాలనీలో గల పవన్ యూత్ శక్తి గణేష్ మండలి వద్ద మల్లారం ఆశ్రమ పీఠాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుని విశిష్టతను గోమాత ప్రత్యేకతను వివరించారు. యువతీ, యువకులు చెడుమార్గాలను వీడి భక్తితో సన్మార్గంలో నడవాలని సూచించారు. మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించిన యూత్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో పవన్ యూత్ సభ్యులు, గ్రామస్థులున్నారు.

'బీడీ కార్మికులకు రూ.4016 ఇవ్వాలి'

ఏర్గట్ల, సెప్టెంబరు13: కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీడీ కార్మికులకు రూ.4016 ఎలాంటి ఆంక్షలు లేకుండా భృతిని ఇవ్వాలని తెలంగాణ ప్రగతీశీలా బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క, సారా సురేష్, రాజేశ్వర్, కార్మికులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న మహిళలు

ప్రశాంతంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

రెంజల్, సెప్టెంబరు13: మండలంలోని నీలాలో 7వ రోజు గణేష్ నిమజ్జన శోభాయాత్ర శాంతియుత వాతావరణంలో ముగిసింది. శుక్రవారం గణేష్ నిమజ్జనం భారీ బందోబస్తు నడుమ సాగింది. శోభాయాత్రను బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గణేష్ శోభాయాత్రను ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, ప్రత్యేక పోలీసు బలగాలు, స్పెషల్ పార్టీ ఎస్‌బీ నిఘాతో ప్రత్యేక ఏర్పాట్లలో ఎటువంటి అవాంతరాలు లేకుండా శాంతియుత వాతావరణంలో నీలాలో గణేష్ నిమజ్జనం సాగింది. గణేష్‌ల వద్ద భక్తిపాటలతో కోలాటాలు, దండియాలతో యువతీ, యువకులు నృత్యాలుచేశారు. శోభాయాత్రను తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఏర్పాట్లు పరిశీలించారు. రెంజల్ ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పర్యవేక్షించారు.

విఘ్నేశ్వరుడి ఆశీస్సు అందరిపై ఉండాలి

● బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి

బోధన్‌రూరల్,సెప్టెంబరు13: విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతాలల్లోని వినాయక మండపాల్లో 7వ రోజు వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్య దామోదర్‌లతో మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి మూడు నెలల జైలు

బోధన్ రూరల్, సెప్టెంబరు13: ఫోన్ దొంగలించడమే కాకుండా మహిళను భయభ్రాంతులకు గురిచేసిన వ్యక్తికి బోధన్ కోర్టులో న్యాయాధికారి 3 నెలల జైలుశిక్ష విధించారు. దొంగతనం నిరూపణ కావడంతో మూడునెలల జైలుశిక్ష విధించారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి, ఎస్ఐ అనిల్ రెడ్డి, కోర్టు సిబ్బంది తదితరులున్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

బోధన్‌రూరల్, సెప్టెంబరు13: లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, బోధన్ అయ్యప్ప సేవా ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ మండలంలోని సాలంపాడ్ క్యాంప్ గ్రామంలోని కోదండ రామాలయం కల్యాణ మండపంలో ఉచిత కంటి పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ సెక్రెటరీ పోశెట్టి, రీజినల్ సెక్రెటరీ సూరబత్తుల శ్రీనివాస్ రావు, లయన్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సీతారాం ఏచూరి మరణం తీరని లోటు

బోధన్‌రూరల్, సెప్టెంబరు13: సీపీఐ(ఎం) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పేదవర్గాలకు తీరని లోటని ఆ పార్టీ నాయకులు గంగాధరప్ప, కుమార స్వామి అన్నారు. శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచి కమ్యూనిస్టు పార్టీ వైపు అడుగు చేసి కార్మికులు, అణగారిన వారి హక్కుల కోసం సుదీర్ఘ పోరాటంచేసిన ఏచూరి మరణం తీరని లోటన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్, పోశెట్టి, గోపి, నసీర్, హన్మంత్ రావు, షేక్.బాబా ఫైమద్, తదితరులు పాల్గొన్నారు.

● బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటు

సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం బడుగు, బలహీన వర్గాలకు తీరనిలోటని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ హన్మంత్ రావు అన్నారు. దేశ రాజకీయలతో పాటు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పోరాడిన యోధుడని కొనియాడారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

కోటగిరి: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం తీరని లోటని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడిత, తడిత, అణగారిన వర్గాలవైపు నిలబడి వారి సమస్యలపై ఏలుగెత్తిన వామపక్ష యోధుడు కామ్రేడ్ ఏచూరి మరణం వామపక్షాలకు తీరని లోటని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో అడుగు పెట్టిన సీతారాం ఏచూరి జాతీయ రాజకీయాలలో క్రియాశీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్, హన్మాండ్లు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విప్లవ ఉద్యమానికి తీరని లోటు

వర్ని: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి విప్లవ ఉద్యమానికి తీరని లోటు అని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. శుక్రవారం వర్ని మండల కేంద్రంలోని సుభాష్ చౌరస్తాలో సీతారాం ఏచూరి పూలమాలల వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మేకల మల్లేష్, గంగాధర్, సాయిబాబా, సాయిలు, మారయ్య, సాయి, లింగం, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌కు విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు13: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా ప రిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.సాత్విక్, కల్లడ జిల్లాపరిషత్ ఉన్నపాఠశాలకు చెందిన బండారి హరికుమార్ ఎంపికైనట్టు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, రామోజీ నాగరాజు తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను పీడీ సురేందర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 14న నుంచి వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

ఏర్గట్ల డిప్యూటీ తహసీల్దార్‌గా విష్ణువర్ధన్ బాధ్యతలు

ఏర్గట్ల, సెప్టెంబరు13: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌గా విష్ణువర్ధన్ బాధ్యతలు చేపట్టారు. బదిలీలో భాగంగా బోధన్ నుంచి ఏర్గట్లకు బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్‌కు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు. బదిలీపై వెళుతున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌ను సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ సదానంద్, కిరణ్, రాకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటగిరి ఎంపీడీవోగా శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి,సెప్టెంబర్ 13: కోటగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీవో చందర్ నాయక్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి పూర్తిస్థాయి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీవోను మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో చందర్ నాయక్, ఏపీవో గంగారాం, పంచాయతీ కార్యదర్శి ముజాఫర్ బేగ్ పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రత్యేక అధికారిణిగా కవిత బాధ్యతల స్వీకరణ

నవీపేట, సెప్టెంబరు 13: మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాల ప్రత్యేక అధికారిణిగా కవిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పాఠశాల ప్రత్యేకాధికారిణిగా పనిచేసిన రాణి నిజామాబాద్ సౌత్ కేజీబీవీకి బదిలీ కాగా, భద్రాద్రి కొత్తగూడెం కేజీబీవీ ప్రత్యేక అధికారిణిగా పనిచేసిన కవిత బదిలీపై మోకన్‌పల్లి కేజీబీవీ ప్రత్యేక అధికారిణిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

నవీపేట తహసీల్దార్‌గా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ

నవీపేట, సెప్టెంబరు13: నవీపేట తహసీల్దార్‌గా వెంకట రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నవీపేట తహసీల్దార్‌గా పనిచేసిన నారాయణ గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేయడంతో డొంకేశ్వర్ తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణ నవీపేట తహసీల్దార్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు తహసీల్దార్ వెంకట రమణను సన్మానించారు.

ఎంపీడీవో కార్యాలయ బోర్డుపై ఓటరు జాబితా

బోధన్‌రూరల్,సెప్టెంబరు 13: బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో బోర్డుపై ఓటరు జాబితా లిస్టును ఏర్పాటుచేసినట్లు బోధన్ ఎంపీడీవో బాలగంగాధర్ అన్నారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ బోర్డుపై ఓటరు జాబితా లిస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కామారెడ్డిలో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు13: కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. శుక్రవారం ఉదయం ఎల్లారెడ్డిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్‌కుమార్‌తోపాటు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మద్నూర్‌లో..

మద్నూర్: మద్నూర్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన బీఆర్ఎస్ నాయకులను మద్నూర్ పోలీసులు ముందస్తుగా అరెస్టుచేశారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు పిలుపుమేరకు హైదరాబాద్ తరలివెళ్తున్న నాయకులను తెల్లవారు జామునే ముందస్తుగా మద్నూర్‌లో అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు బస్సీపటేల్, మాజీ సర్పంచ్‌లు ధరస్ సురేష్, షేక్‌గఫార్, అబ్దుల్ కరీం, నాయకులు గోవింద్, సుల్తాన్, కంచన్ రవి, అవార్ రాజు తదితరులు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్: హైదరాబాద్‌కు బీఆర్ఎస్ నాయకులు తరలిరావాలంటూ బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో జుక్కల్ నియోజకవర్గంలోని పెద్దకొడప్‌గల్, జుక్కల్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్‌చేశారు. ఈ సందర్భంగా పెద్దకొడప్‌గల్ ఎస్సై మహేందర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామని తెలిపారు.

దాడి సిగ్గుచేటు..


కామారెడ్డిటౌన్: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆయన అనుచరులు దాడిచేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నిట్టువేణుగోపాల్‌రావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే హరీష్‌రావు పిలుపుమేరకు హైదరాబాద్‌కు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్‌చేసి పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయినవారిలో బీఆర్ఎస్ నాయకులు ముప్పారపు ఆనంద్, గెరిగంటి లక్ష్మీనారాయణ, నజీర్, నిట్టు వెంకట్‌రావు, పిట్ల వేణు, సంగిమోహన్, ముదాంనవీన్ తదితరులు ఉన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు సంబంధించిన బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. అరెస్ట్‌అయిన వారిలో మండల పార్టీ నాయకులు నల్లవెల్లి అశోక్, బలవంతరావు, మోహన్‌రెడ్డి, శంకర్, కృష్ణమూర్తి, అంద్యాల రమేష్, మల్లగారి బాలయ్య, శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరు

తాడ్వాయి: అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. హైదరాబాద్‌కు బయలుదేరుతున్న నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మండల నాయకులు పులగం సాయిరెడ్డి, సోసైటి చైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముదాంనర్సింలు, రమేష్‌రావు, మంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి,రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

బిచ్కుందలో..

బిచ్కుంద: ప్రజలకు ఇచ్చినహామీలను నేరవేర్చాలని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం సిగ్గుచేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రావుదేశాయ్ అన్నారు. శుక్రవారం పాడికౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మెల్యే హరీష్‌రావు పిలుపు మేరకు హైదరాబాద్‌కు వెళ్తున్న తమను అక్రమంగా అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించడం తగదని అన్నారు. అరెస్ట్‌అయిన వారిలో మాజీ ఎంపీపీ అశోక్‌పటేల్, నాల్చార్‌రాజు,ప్రధానకార్యదర్శి రాంచందర్, సోసైటి చైర్మన్ బాలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ: మండంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్‌చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదివికి అనర్హుడని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుంచాల శేఖర్, గజవాడ శ్రీకాంత్ కడారి రమేష్, రాజిరెడ్డి, శ్రీనివాస్, శేఖర్, కిషన్‌రెడ్డి, నాగరాజు ఉన్నారు.



మద్నూర్‌లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

మద్నూర్, సెప్టెంబరు 13: మండల కేంద్రంలో మంగళవారం జరగనున్న వినాయక నిమజ్జన శోభాయాత్ర రూట్‌ను, నిమజ్జనం చేసే మైసమ్మ చెరువును శుక్రవారం రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గణపతి మండపాల నిర్వాహకులు, యువత, ప్రజలు భక్తి శ్రద్ధలతో నిమజ్జనం కార్యక్రమం జరుపుకోవాలని తెలియజేశారు. నిమజ్జన రూట్ మ్యాప్‌ను పరిశీలించిన వారిలో మద్నూర్ మండల తహసీల్దార్ ఎం.డి.ముజీబ్, సీఐ నరేష్, ఎంపీడీవో రాణి, ఎంపీపీ నర్సయ్య, మండల గిర్దావర్ శంకర్, ఎస్ఐ విజయ్, పంచాయతీ కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

చిన్నారులకు పోషకాహాకారాన్ని అందించండి

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 13: మండలంలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారుల్లో పోషకాహారం లోపించకుండా చర్యలు తీసుకోవాలని మద్నూర్ ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో కళావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకమాసం వారోత్సవాలకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులతో పాటు, బాలింతలు, గర్భిణులు పోషకాహారం లోపం లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, బాలింతలకు శ్రీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాల్లో తమ రికార్డులు ఆన్‌లైన్ చేయడంతో పాటు, కేంద్రాల నిర్వహణ సరిగ్గా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ నసీమా, పోషకాభియాన్ కో ఆర్డినేటర్ బాలక్రిష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీపై రూ.937కే విద్యుత్ మీటరు

మద్నూర్, సెప్టెంబరు 13 : నిరుపేద కుటుంబాలకు ఎన్పీడీసీఎల్ సువర్ణ అవకాశం కల్పిస్తుందని మండల విద్యుత్ శాఖ ఏఈ అరవింద్ తెలిపారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబ సభ్యులకు జీఎస్టీతో కలిపి రూ.937లకే గృహాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈనెల 1వ తేదీ నుంచి విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో తిరిగి ఇందుకు మీటరు లేని నిరుపేదలను గుర్తించి దరఖాస్తు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఇళ్ల విద్యుత్ కనెక్షన్ కోసం మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని కరెంట్ లోడ్ ఆధారంగా నగదు చెల్లించాల్సి వచ్చేది. అయితే పేదలకు తాజాగా విద్యుత్‌శాఖ అతి తక్కువ ధరకే మీటరు పొందడం సులభతరం చేసింది. 250 నుంచి 500 వాట్ల విద్యుత్ వినియోగించే పేద కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్ కోసం సిబ్బందికి డబ్బులు చెల్లిస్తే నేరుగా రశీదును ఇచ్చే ఏర్పాట్లు చేసింది.

కావాల్సిన పత్రాలు

రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఎవరికైతే మీటరు అవసరం ఉన్న వారికి గతంలో వారి పేరు మీద విద్యుత్ మీటర్ ఉండరాదని, ఇంటి పన్ను కట్టిన రశీదు వారి పేరు మీదనే ఉండాలని సూచించారు. ఈ అవకాశం సెప్టెంబరు 15 వరకు ఉందని, నిరుపేదలైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బీర్కూర్‌లో దివ్యాంగులకు బస్ పాస్‌లు అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్‌లో దివ్యాంగులకు బస్ పాస్ పంపిణీ

బీర్కూర్, సెప్టెంబరు 13 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగులకు ఆర్టీసీ అధికారులు బస్ పాస్‌లను పంపిణీ చేశారు. 25 మంది దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేసినట్లు బోధన్ బస్ డిపో అధికారి గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, దివ్యాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు కుమ్మరి సాయిలు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను విడుదల చేసిన అధికారులు



ఎల్లారెడ్డిలో ఓటరు జాబితాను నోటీస్ బోర్డుపై పెడుతున్న ఆర్డీవో

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 13: రానున్న రోజుల్లో జరిగే పంచాయతీ ఎన్నికల దృష్ట్యా శుక్రవారం పెద్ద కొడప్‌గల్, జుక్కల్ మండలాలకు చెందిన ఎంపీడీవోలు లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌లు మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితా ముసాయిదా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలు మాట్లాడుతూ ఓటరు జాబితాను మండాలల్లోని ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించామన్నారు. ఈ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14 నుంచి 21 వరకు సంబంధిత పంచాయతీ కార్యదర్శికి లేదా మండల ఎంపీడీవోకు దరఖాస్తు చేసుకున్నట్లయితే సవరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ పంచాయతీ కార్యదర్శి బల్‌రాంతో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 31 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఓటరు జాబితాను ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రత్యేక అధికారి మన్నె ప్రభాకర్ ఓటరు జాబితాను విడుదల చేసి నోటీసు బోర్డుపై పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారు జాబితాలో పేర్లు చూసుకొని ఏవైనా తప్పులు ఉంటే సవరణ కోసం సంబంధిత బూత్ లెవెల్ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రకాష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలోని అమర్లబండ గ్రామ పంచాయతీలో 2024 ఓటరు జాబితాను పంచాయతీ కార్యదర్శి రవీందర్ ప్రదర్శించారు. నెలరోజుల నుంచి ఓటరు జాబితా సవరణ చేపట్టి మార్పులు చేర్పులు సవరించిన అనంతరం పంచాయతీల్లో సభ్యుల ముందు ప్రదర్శించారు. గ్రామంలో ఎవరైన మిగిలి ఉన్న ఓటర్లు తమ ఓటు నమోదు చేసుకోవడానికి గ్రామ పంచాయతీలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని 9 గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ నోటీసు బోర్డుపై గ్రామ పంచాయతీ ముసాయిదా ఓటరు జాబితా వార్డుల వారీగా నోటీస్ బోర్డుపై ఉంచామని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జాబితాలో ప్రజలకు ఏవైన అభ్యంతారాలు ఉంటే ఆయా గ్రామ పంచాయతీల్లో ఈ నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని సూచించారు. దోమకొండ మండల పరిధిలోని 9 గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటరు జాబితా నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాణిక్యరావు, శ్రీకాంత్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మండల విద్యార్థులు



ప్రశంసా పత్రాలతో మండల విద్యార్థులు

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 13: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన సౌత్ జోన్ అథ్లెటిక్ అసోసియేషన్ క్రీడాపోటీల్లో పెద్ద కొడప్‌గల్ మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు వడ్లం పాఠశాల పీఈటీ ధర్మేందర్ తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో వడ్లం పాఠశాలకు చెందిన భట్ కీర్తన హైజంప్‌లో ప్రథమ స్థానం, మనూష షాట్‌పుట్‌లో రెండవ స్థానం, జాలాబాయి జావెలిన్‌త్రోలో రెండవ స్థానం, రాంసింగ్ 1500 మీటర్ల రన్నింగ్‌లో రెండవ స్థానం సాధించారని తెలిపారు. దీంతో పాటుగానే మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విశాఖ లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం, అంజలి జావెలిన్ త్రోలో మొదటి స్థానం, శ్రీలత 600 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానం, పెద్ద కొడప్‌గల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సింధూ 60 మీటర్ల పరుగు పందెంలో 3 స్థానం, ముస్తాపా 8 వందల మీటర్ల పరుగుపందెంలో రెండవ స్థానం సాధించారని తెలిపారు. ఇందులో నుంచి కీర్తన, విశాఖ ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో పీఈటీలు మల్లేష్, లత, జ్యోతిలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ అండర్ 14, 16, 18, 20 బాలబాలికల రన్స్, త్రోస్, జంప్స్ వంటి సెలక్షన్స్‌లో గెలుపొందిన దాదాపు 31 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తెలిపారు.

సీతారాం ఏచూరి ఆశయాలు సాధిద్దాం



పెద్దకొడప్‌గల్‌లో సీతారాం ఏచూరికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 13: సీపీఎం ప్రధాన కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ మాజీ జాతీయ అధ్యక్షుడు సీతారాం ఏచూరి నిన్న మరణించడంతో ఆయనకు కామారెడ్డి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే పేద ప్రజల పక్షాన, కార్మికుల, విద్యార్థుల పక్షాన పోరాడారని అన్నారు. ఆయనను కోల్పోవడం అంటే దేశం గొప్ప మేధావిని కోల్పోయినట్లే అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విజయరామరాజు, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: సీతారాం ఏచూరి మృతి చెందడంతో శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలో సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు ఏచూరి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్ గొండ మాట్లాడుతూ సీతారా ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. దీంతో పాటుగానే దేశ సమస్యలు పార్లమెంట్లో ప్రస్తావించడంలో చురుకైన పాత్ర వహించేవాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆడెప్ప, షేక్‌పారుఖ్, ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, పిర్దోస్, హమ్మద్, ఆషఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి: సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని మండల సీపీఎం నాయకులు అన్నారు. పార్లమెంట్‌లో ప్రజాసమస్యలపై ప్రస్తావించడం, దేశంలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు ప్రస్తావించడంలో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, సాయిలు, మధు, రాములు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోపై కాంగ్రెస్ నాయకుల మండిపాటు

దోమకొండ, సెప్టెంబరు 13: మండల కేంద్రంలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ అందుబాటులో లేకపోవడంతో నాయకులు అధికారికి ఫోన్‌లో మాట్లాడి వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేయగా ఆయన కాంగ్రెస్ నాయకులపై చిందులు వేశారు. ప్రస్తుత సమయంలో డెంగీ, చికెన్‌గున్యా ఇతర వ్యాధులు వ్యాపిస్తున్నాయని వైద్యులను అందుబాటులో ఉంచుతూ వైద్యం అందించాలని కోరడానికి వచ్చామని మీరు ఎక్కడ ఉన్నారని అధికారితో చెప్పగా తాను ఎక్కడ ఉన్న విషయం మీకు ఎందుకు తెలుపుతానన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, రావులపల్లి నర్సారెడ్డి, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజు, రాంలు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రాజారాం

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

తాడ్వాయి, సెప్టెంబరు 13: అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి పిల్లలకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. మండల అధికారి సయ్యద్ సాజిద్‌అలీ, ఎంపీఓ హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి : ఆర్డీవో

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 13 : పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని అధికారులకు గ్రామ ప్రజలకు ఎల్లారెడ్డి ప్రత్యేక అధికారి ఆర్డీవో మన్నే ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే సందర్భంగా మల్లాయపల్లి గ్రామంలో పర్యటించారు. ఇంటి ఆవరణ పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటును చేసి సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి తగిన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడి ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ప్రకాష్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు మంత్రి పదవి రావాలని ప్రార్థన

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 13: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు మంత్రి పదవీ రావాలని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గులాం హుస్సేన్ శుక్రవారం రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా షరీఫ్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు గులాం హుస్సేన్ తెలిపారు. దర్గాలో పూల చాదర్‌ను సమర్పించి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు మంత్రి పదవీ రావాలని ప్రార్థించినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల సస్పెన్షన్

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 13:పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన పలువురిని పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావు, ముప్పారపు ఆనంద్, ముదాం నవీన్, నిట్టు వెంకట్‌రావు, నిట్టు కృష్ణమోహన్‌ల ప్రాథమిక సభ్యత్వం రద్దు చేస్తూ సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉంటూనే పార్టీ వ్యతిరేక పనులకు పాల్పడుతూ బీజేపీకి మద్దతుగా ప్రచారం చేసిన ందున వారిపై అధిష్ఠానం నిర్ణయం మేరకు సస్పెండ్ చేశామని అన్నారు.

జిల్లాస్థాయి యువజన పోటీలు

కామారెడ్డి రూరల్, సెప్టెంబర్ 13: కామారెడ్డి జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న జిల్లా స్థాయి యువజన పోటీలు ఉదయం 10 గంటల నుంచి కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తామని జిల్లా యువజన, క్రీడల అధికారి జగన్నాథం తెలిపారు. జానపద నృతం(బృందం, సోలో), జానపద గీతాలు, సైన్స్ మేళా, హస్తకళ, వస్త్రకళ, ఆగ్రో ఉత్పత్తులపై, కథ రచన, పెయింటింగ్, కవిత్వం పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కళాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. కామారెడ్డి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే వారు కామారెడ్డి జిల్లాకు చెందిన వారే ఉండాలన్నారు. పాల్గొనే అభ్యర్థులు 15 నుంచి 29 సంవత్సరాలలోపు ఉండాలని తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో జాతీయ యువజన ఉత్సవాల్లో పాల్గొన్న వారు పోటీలకు అనర్హులని తెలిపారు. వివరాలకు జిల్లా యువజన, క్రీడల కార్యాలయం కామారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం రూమ్ నెంబర్ 223లో సంప్రదించాలని జిల్లా యువజన క్రీడల అధికారి కె.ఎస్.జగన్నాథం తెలిపారు.



అక్కంపల్లిలో గణేష్ మండపం వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

గణేష్ మండపం వద్ద కుంకుమార్చన

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 13 : మండలంలోని అక్కంపల్లి గ్రామంలో గణేష్ మండపం వద్ద శుక్రవారం గ్రామస్థులు, భక్తులు భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన, హోమం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నిత్యం భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం హోమం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు భారీ సంఖ్యలో కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ లక్ష్మీబాబు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

బిచ్కుంద, సెప్టెంబరు 13: మండలంలోని మిషన్ కల్లాలి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి మిషన్‌కల్లాలి గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7 వేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైన పేకాట ఆడినట్లయితే సమాచారం పోలీసులకు అందివ్వాలని వివరాలు తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ అన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

దోమకొండ, సెప్టెంబరు 13: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులు చికిత్స పొందుతూ మృతి చెందడంతో దోమకొండ మండలంలోని ముత్యంపేట్ గ్రామం శోక సంద్రంలో మునిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత మంగళవారం ముత్యంపేట్ గ్రామానికి చెందిన జొన్నల రాము, ముత్తి రమేష్ కామారెడ్డికి పనుల నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా ఉగ్రవాయి-భవానిపేట్ స్టేజీ వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు గాయాలయ్యాయి. దీంతో వెంటనే వారిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. వారు చికిత్స పొందుతూ గురువారం జొన్నల రాము మృతి చెందగా, శుక్రవారం తెల్లవారుజామున ముత్తి రమేష్ మృతి చెందాడు. ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విశాదఛాయలు అలుముకున్నాయి.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

పిట్లం, ఆగస్టు 13: తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశంలో బొమ్మల నాందేవ్(23)అనే యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మండలంలోని తిమ్మానగర్ గ్రామానికి చెందిన నాందేవ్ ఎలాంటి పనులు చేయక ఖాళీగా తిరుగుతున్నావని తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశంలో తన పొలం వద్దకు శుక్రవారం ఉదయం వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడని ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం

తాడ్వాయి, సెప్టెంబరు 13: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని మండల అధ్యక్షుడు జూకంటి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సోమారం గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రైతు రుణమాఫీకాని వారి కోసం తమ వంతుకృషిచేసి రుణ మాఫీ జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షౌకత్‌అలీ, ఏఎంసీ చైర్మన్ రాజిరెడ్డి, సమన్వయసమితి సభ్యులు లక్ష్మణాచారి,ఎంపీటీసీ జలంధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవులు, మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
శాంతి	సరిపోదా శనివారం
దర్శన్	ఏఆర్ఎమ్
ప్రియా 35	మత్తు వదలరా-2

బాన్సువాడ	
మహేశ్వరి	సరిపోదా శనివారం
వెంకటేశ్వర	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190

